క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో చోరీ!



కప్తానుపాలెం(మోపిదేవి): కప్తానుపాలెంలో జాతీయ రహదారి పక్కన సాయిబాబా ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రోజువారీ పూజా కార్యక్రమాలు చేయడానికి భక్తులు వచ్చారు. అప్పుడు ఆలయ తాళాలు పగలగొట్టి గేటు తెరచి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని ఆలయ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ చోరీ జరిగిందని, ఏ వస్తువులు పోయాయనేది చెప్పడానికి సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేరన్నారు. వారి నుంచి వివరాలు తీసుకోవాల్సి ఉందని ఎస్‌ఐ అన్నారు. క్లూస్ టీం వచ్చి పరిశీలించారు. సాయిబాబా విగ్రహం తలపై ఉండే రెండు వెండి కిరీటాలు, బాబా విగ్రహాన్ని దొంగిలించినట్లు తెలియవచ్చింది.

రేపు సకలేశ్వరస్వామి కల్యాణోత్సవం



మోపిదేవి: స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత సకలేశ్వర స్వామివారి వార్షిక కల్యాణోత్సం ఈ నెల 6వ తేదీ బుధవారం రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి జె. ప్రవణ తెలిపారు. అందులో భాగంగా ఉదయం 10 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుడిని చేస్తారని, సాయంత్రం 4 గంటలకు స్వామి వార్లను రావివారిపాలెం వరకు ప్రత్యేక పల్లకీలో ఊరేగిస్తారని పేర్కొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం డిపో నుంచి శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలైన పెదకళ్లేపల్లి, ఐలూరు, శ్రీశైలం దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ సాయంత్రం నుంచి 8వ తేదీ సాయంత్రం వరకు పెదకళ్లేపల్లి, ఐలూరులకు ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. పామర్రు నుంచి ఐలూరుకు, కూచిపూడి నుంచి ఐలూరుకు, కాజ, కోసూరు, మొవ్వ, కూచిపూడి మీదుగా ఐలూరుకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు.

బలుసులమ్మ ఆలయానికి ఉత్సవమూర్తుల విగ్రహాలు



మోపిదేవి: తాడేపల్లిగూడెంలోని బలుసులమ్మ దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సర్పదోష నివారణ పూజలు, స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో సోమవారం సాయంత్రం తరలించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా మినుము



కోడూరు: రబీలో రెండో పంటగా సాగు చేసిన మినుము చేతికి రావడంతో రైతులు కాయతీత పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ఈ ఏడాది సుమారు 11వేల ఎకరాల్లో రైతులు మినుము సాగు చేశారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లోని రైతులు ఈ మినుము కాయతీతలను కూలీలు, యంత్రాల సాయంతో ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. మాచవరం, వి.కొత్తపాలెం, జయపురం లింగారెడ్డిపాలెం, మందపాకల, పోటుమీద, పిట్టల్లంక ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ కాయతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ఏడాది సకాలంలో కాలువ వెంట ఆరుతడికి నీరు అందడంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా పంట దిగుబడి అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎగువ ప్రాంతాల్లో ఎకరానికి ఐదు నుంచి పది బస్తాలు వరకు దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. తీరప్రాంత గ్రామాలైన హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం రైతులు వరి నూర్పిళ్లు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

గృహయోగం



మచిలీపట్నంలో టిడ్కో గృహం వద్ద లబ్ధిదారులు

- టిడ్కో లబ్ధిదారులకు అందిన గృహాలు
- ఆనందోత్సాహాల్లో లబ్ధిదారులు
- నగరంలో రూ.167.71 కోట్లతో 2,304 ఇళ్ల నిర్మాణం
- తొలివిడతగా 1,296 గృహాలు అందజేత

మచిలీపట్నంటౌన్: ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న టిడ్కో జీ+3 గృహం ఎట్టకేలకు తమ సొంతం అవడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం వలన టిడ్కో గృహాల నిర్మాణం అరకొరగా జరిగాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం టిడ్కో గృహ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. నగరంలోని గో సంఘం వద్ద 11.10 ఎకరాల స్థలంలో 864 ప్లాట్లు, రుద్రవరంలో 25.78 ఎకరాల్లో 1440 ప్లాట్లు మొత్తం 2304 ప్లాట్లు నిర్మించారు. ఈ గృహాల నిర్మాణం, మౌలిక వసతులు కల్పనకు రూ.167.71 కోట్లు వెచ్చించారు. వీటిలో గో సంఘం వద్ద నిర్మాణం చేసిన 1296 ప్లాట్లను ఫిబ్రవరి 29వ తేదీ గురువారం టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది.



గోసంఘంలోని టిడ్కో గృహసముదాయం

గృహ ప్రవేశాలకు సంసిద్ధం

గృహాల తాళాలు పొందిన లబ్ధిదారులు మంచి ముహూర్తాలు చూసుకుని గృహ ప్రవేశాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. గోసంఘం, రుద్రవరంలో గృహాలు నిర్మించగా ప్రస్తుతం గోసంఘం వద్ద 864 ప్లాట్లు, రుద్రవరంలో 432 ప్లాట్లను పంపిణీ చేశారు. రుద్రవరంలో 1008 ప్లాట్లను లబ్ధిదారులకు త్వరలోనే అందించనున్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



టిడ్కో గృహం అందుతుందో లేదోననే సందేహంతో ఉన్న నాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో అన్ని వసతులతో పనులు పూర్తి చేసి అందించారు. వృద్ధురాలినైన నాకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఫ్లాటు ఇచ్చారు. సొంత ఫ్లాట్‌ను చూసి ఎంతో ఆనంద పడ్డాను. ఫ్లాటు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– గూటాల సత్యవతి, గొడుగుపేట

జగనన్న మేలు మర్చిపోను



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గృహాన్ని అందించిన సీఎం జగనన్న మేలు ఎన్నటికీ మర్చిపోను. అద్దె ఇళ్లలో మగ్గుతున్న మాలాంటి పేదోళ్లకు ఈ గృహం ఎంతగానో ఉపయోగపడుతుంది. సొంతింటి కల ఇన్నాళ్లకు నెరవేరింది. ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన తనయుడు పేర్ని కిట్టుల కృషితో త్వరగా పనులు పూర్తయ్యాయి.

– మొహమ్మద్ జుబేదా, ఇనుగుదురుపేట

అన్ని వసతులతో గృహాలు



మచిలీపట్నం గో సంఘం, రుద్రవరం వద్ద నిర్మించిన టిడ్కో జీ+3 గృహాలను అన్ని వసతులతో నిర్మించాం. రెండు చోట్ల నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రెండు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. తాగునీటి సరఫరా నిమిత్తం పుట్లమ్మచెరువు వద్ద నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో నింపనున్నాం. రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాం. వినియోగించిన నీరు శుద్ధి చేసేందుకు ప్లాంటు ఏర్పాటు చేశాం.

– ఎం.గణేష్‌బాబు, టిడ్కో ఏఈ

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

- గత ప్రభుత్వానికి.. ఈ ప్రభుత్వానికి తేడా గమనించండి
- పింఛన్లు ఇంటికి వచ్చి ఇస్తున్నారు
- వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, హారిక



వృద్ధురాలిని కలిసి మాట్లాడుతున్న రాము, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక్కసారి చాన్స్ ఇస్తేనే నేరుగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయ పార్టీలకు అతీతంగా అందుతున్నాయని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పెడన మండలంలోని శింగరాయపాలెం, మడక, బల్లిపర్రు గ్రామాల్లో ప్రజా దీవెన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి పాల్గొన్నారు. రాము, హారిక దంపతులు ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రెండు ఓట్లు కూడా ఫ్యానుకు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాల్సిందిగా కోరారు.

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అవకాశాన్ని ప్రజలు ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మరొక్కసారి అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ ఫలాలను అందించడమే కాకుండా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలబెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ గతంలో పింఛన్లు తీసుకునేందుకు ఆపసోపాలు పడే పరిస్థితి ఉండేదని, ఇప్పుడా ఆ పరిస్థితి లేదని ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్న విషయాన్ని గుర్తుంచుకుని జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ పెడన మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, నేతలు గరికపాటి వెంకటరామానాయుడు, రాజులపాటి అచ్యుతరావు, పామర్తి బెనర్జీ, ఎంపీటీసీ బొల్లా ఉదయ్‌నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజికాభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

పేర్ని కిట్టు



పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సామాజికాభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తూ సంక్షేమ పథకాల ద్వారా మార్పునకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 41, 20 డివిజన్లలో అభివృద్ధి పనులను సోమవారం మేయర్ వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ. 20 కోట్లతో నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 41వ డివిజన్‌లో రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు, పక్కా డ్రెయిన్, 20వ డివిజన్‌లో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కమిషనర్ బాపిరాజు, మాజీ డెప్యూటీ మేయర్, 41, 20 డివిజన్ల కార్పొరేటర్లు లంకా సూరిబాబు, తిరుమలశెట్టి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు



శ్మశానవాటికలో పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ, పాస్టర్లు

మచిలీపట్నంటౌన్: నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారికి అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 7వ డివిజన్ పరిధిలో క్రైస్తవుల శ్మశానవాటికకు కేటాయించిన ఐదు ఎకరాల స్థల అభివృద్ధి, ప్రహరీ, గేటును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రైస్తవులు శ్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) స్పందించి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డితో మాట్లాడి రూ. 30.39 లక్షల నిధులను రాబట్టి అభివృద్ధి పనులు చేయించారన్నారు.

క్రైస్తవులకు కేటాయించిన శ్మశాన స్థలంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ గత టీడీపీ పాలకులను క్రైస్తవులకు శ్మశానస్థలాన్ని కేటాయించాలని పలుమార్లు వినతులు ఇచ్చామని.. అయినా సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పుడు శ్మశానవాటిక నిర్వహణకు మనిషిని ఏర్పాటు చేయటం హర్షణీయమన్నారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ పేర్ని కుటుంబం మాట ఇస్తే ఆ మాట నిలుపుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కార్పొరేటర్ పడమట రేవతి, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం నాయకురాలు అనుపమ ముఖర్జీ, పాస్టర్ల సంఘం నాయకులు వాల్టస్, ప్రేమ్‌కుమార్, పరంజ్యోతి, ఏబేలు తదితరులు పాల్గొన్నారు. తొలుత నగరం నుంచి శ్మశానవాటిక వరకు క్రైస్తవులు, దళిత జేఏసీ నేతలు తదితరులు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు.

ఎయిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేత

చల్లపల్లి: అనారోగ్యంతో మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారుడికి వలంటీర్ మంగళగిరి వెళ్లి పెన్షన్ అందజేశారు. చల్లపల్లి గ్రామ సచివాలయం–3 పరిధిలోని నివాస ప్రాంతానికి చెందిన వృద్ధుడు కుంభా వెంకయ్య అనారోగ్యంతో మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని బ్లాక్.. వలంటీర్ దేవిశెట్టి శివపార్వతి వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలను సోమవారం మంగళగిరి ఎన్నారై ఆసుపత్రికి వెళ్లి అందజేశారు. సుదూర ప్రాంతంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా అక్కడి వరకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్ శివపార్వతికి లబ్ధిదారుడు, కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

గోగినేనిపాలెం(ఘంటసాల): బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గోగినేనిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో పోషణ అభియాన్ సంబరాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన సోమవారం బాలికలకు కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏటా మార్చి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తూ బాలికలు ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

సంగమేశ్వరం(నాగాయలంక): శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకరరావు, అర్చకస్వామి కొల్లిపర శివ సాయి తిరుమల భార్గవ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా శివాలయాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు.

- స్థానిక కృష్ణానది తీరం శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో 8వ తేదిన మహాశివరాత్రి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు సోమవారం చెప్పారు.
- గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరి సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రికి ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని కాలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు తెలిపారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ బుధవారం నుంచి 8వ తేదీ శుక్రవారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బి.సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పాశ్చాపురంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 50 కుటుంబాల వారితో ఉప్పాల రాము

కృత్తివెన్ను: జగనన్న ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఎందరో ఆకర్షితులవుతున్నారని దీని ప్రభావంతో వైఎస్సార్ సీపీ మరింత బలంగా మారిందని ఆ పార్టీ పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. కృత్తివెన్ను మండలంలోని పాశ్చాపురం దళితవాడలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ప్రజాదీవెనలో భాగంగా ఆదివారం రాత్రి వారంతా తమ కుటుంబాలతో సహా టీడీపీని వీడి రాము సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువాలు కప్పుకుని జగనన్నకు తమ మద్దతు ప్రకటించారు. ఇటీవల రాము పెడన ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత మల్లేశ్వరం వాటర్‌స్కీం నుండి సురక్షిత నీటిని అందించేలా ఫిల్టర్ బెడ్లు రిపేరు చేయించడంతో పాటు, స్వచ్ఛమైన నీటిని పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు రాష్ట్రంలో నిరుపేదల ఆర్థికాభివృద్ధి కేవలం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నమ్మి వారంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శివకృష్ణ, బాలాజీ, బాలయేసు, బ్రహ్మశాస్త్రి, సబ్‌స్టిన్, వీరాస్వామి, రాజా, వంశీ, జాన్‌ఏసు, మరియదాసు తదితరులు ఉన్నారు.

బాతుల్లంక రోడ్డు పనులు ప్రారంభం

రూ. 16 లక్షలతో ప్రారంభించిన సర్పంచ్ వెంకటేశ్వరావు



నాగాయితిప్పలో బాతుల్లంక రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరావు

నాగాయితిప్ప(మోపిదేవి): దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న రైతులకు కొత్తగా రోడ్డు ఏర్పాటుతో ఎంతో మేలు జరుగుతుందని సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు అన్నారు. నాగాయితిప్ప బాతుల్లంక రోడ్డు పనులు సోమవారం సర్పంచ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణా కరకట్ట కింద పండించిన పంట వర్షాకాలంలో బయటకు తీసుకురావడానికి రైతులు ఎంతో కష్టపడేవారని తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే జెడ్పీ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు కాగా, పంచాయతీ నుంచి మరో రూ. 6 లక్షలు నిధులు మొత్తం రూ. 16 లక్షలతో ఒక కిలోమీటరు జీఎస్‌పీ రోడ్డు పనులు చేపట్టినట్లు సర్పంచ్ వివరించారు. ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, పాలకేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్‌బాబు, గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరావు, రైతులు పరిశే వెంకటేశ్వరావు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి



పెదకళ్లేపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఏసీ చక్రధరరావు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు కోరారు. మండలంలోని పెదకళ్లేపల్లి నాగేశ్వర స్వామి కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీవిద్య అధ్యక్షతన పలు శాఖల అధికారులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయన్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానది ఘాట్ల వద్ద స్నానాలు ఆచరించే భక్తులు అధికారులు సూచించిన ప్రదేశంలోనే చేయాలని, వాహనాల పార్కింగ్‌కు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కె. హారిక, ఎన్.శ్రీరామ్ సాయిని కో–ఆర్డినేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యులు కడవకొల్లు సీతారామాంజనేయులు, తహసీల్దార్ శ్రీవిద్య, డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ, విశ్రాంతి వీఆర్వో వెంకటేశ్వరావు, అరజా శ్రీకాంత్, అగ్నిమాపక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసీఆర్‌బీ సీఐగా సూర్యనారాయణ



ఎస్పీని కలిసిన డీసీఆర్‌బీ సీఐ సూర్యనారాయణ

కోనేరుసెంటర్: డిస్ట్రిక్ క్రైం రికార్డ్ బ్యూరో (డీసీఆర్‌బీ) ఇన్‌స్పెక్టర్‌గా ఎస్వీఎస్ సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గన్నవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ని డీసీఆర్‌బీ కి బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీసీఆర్‌బీ సీఐ గా పనిచేస్తున్న పెద్దిరాజును గన్నవరం ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ నయీమ్ అస్మిని సీఐ సూర్యనారాయణ కలిసి పూల మొక్కను అందజేశారు.

విద్యుత్ లైన్‌మెన్ల సేవలు అభినందనీయం

కలెక్టర్ రాజాబాబు



లైన్‌మెన్లకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు, పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్‌మెన్ల సేవలు అభినందనీయమని కలెక్టర్ రాజాబాబు అన్నారు. జాతీయ విద్యుత్‌లైన్‌మెన్ల దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం డివిజన్‌లోని విద్యుత్ లైన్‌మెన్ల సమావేశం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు అధ్యక్షతన స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ కరెంట్ సరఫరాకు చిన్నపాటి అంతరాయం వచ్చినా లైన్‌మెన్లకు ఫోన్లు చేసి విద్యుత్ పునరుద్ధరణను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మిచాంగ్ తుపాను సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా లైన్‌మెన్లు నిరంతరం పర్యవేక్షించి సేవలు అందించారన్నారు. వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వైద్యం చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం రాకుండా ఎంతో మంది ప్రాణాలను కాపాడారని కొనియాడారు. ఈఈ భాస్కరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే పేర్ని నాని లైన్‌మెన్లలో మనోధైర్యాన్ని కల్పించారన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు, పేర్ని కిట్టు, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఉత్తమ సేవలు అందించిన లైన్‌మెన్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, ఏడీఈ రామకృష్ణ, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు

చల్లపల్లి: జాతీయ లైన్‌మెన్ దివస్ సందర్భంగా చల్లపల్లి విద్యుత్ శాఖ ఉద్యోగులు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. సోమవారం ఉయ్యూరులో విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణనాయక్ ఉత్తమ సేవలను గుర్తిస్తూ అవార్డులు అందజేశారు. చల్లపల్లి మండల విద్యుత్‌శాఖ ఏఈఈ కన్నంరెడ్డి అరవింద్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ పల్లికొండ ఎలీషా ప్రసాద్, వక్కలగడ్డ లైన్‌మెన్ మహబూబ్ సుభానీ అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను సబ్ డివిజన్ డీఈఈ పులి శివనాగేశ్వరరావు అభినందించారు.